# యస్.కె.బి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల

స్థాపితం : 1966

నాక్ బి++

మాచర్ల, పల్నాడు జిల్లా.

## భావవీణ ప్రత్యేక సంచిక


Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 19 Special Issue No. 7 Monthly July 2022 ISSN No. : 2456-4702 Rs. : 15/-


# తెలుగు సాహిత్యం - సామాజికత

## అంతర్జాల అంతర్జాతీయ సదస్సు

తేదీలు : 29, 30 జులై 2022




నిర్వహణ :

## తెలుగు విభాగం మరియు ఐ.క్యూ.ఏ.సి.

# యస్.కె.బి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల

స్థాపితం : 1966 నాక్ బి++

మాచర్ల, పల్నాడు జిల్లా.

# తెలుగు సాహిత్యం - సామాజికత

## అంతర్జాల అంతర్జాతీయ సదస్సు

**తేదిలు : 29, 30 జులై 2022.**

నిర్వహణ :

**తెలుగుశాఖ మరియు ఐ.క్యూ.ఎ.సి.**

# Contents (విషయ సూచిక)

1. గంగు నవల - సామాజిక విశ్లేషణ - బి. మారెప్ప 1
2. రాసాని 'వేట' - యానాదుల వాస్తవిక జీవన చిత్రణ - డా॥. చౌట బాలకృష్ణ 2
3. 'మనువు' కథ - భిన్నవర్గాల స్త్రీలలోని సాంఘిక చైతన్య చిత్రణ - గుత్తికొండ చంద్రకళ 2
4. పాలనాటి వీర చరిత్ర - సామాజిక విశ్లేషణ - డా॥. మన్నెమోని కృష్ణయ్య 3
5. ఆధునిక అధిక్షేప శతకాలు - సామాజిక అంశాలు - డా॥. రత్నశేఖర్ కట్టెపోగు 3
6. త్రిపురనేని రచనలు - సామాజికత - కె. వి. పద్మావతి దేవి 3
7. మిట్టూరోడి కథలలోని సామాజికత - డా॥. టి. జాన్‌కిరణ్‌బాబు 4
8. గుబ్బిం జాషువా గబ్బిలం పావురంగా మారేదెప్పుడు ? - డా॥. గుంటుపల్లి గౌరి 4
9. దూరి వెంకటరావు కథలలో - సామాజికత - బలరామమహంతి శశికళ & - ఆచార్య కొలకలూరి మధుజ్యోతి 5
10. అయుతుని కథ - సామాజికత - డా॥. టి. వెంకటస్వామి 5
11. "సమకాలీన సంక్షుభిత జనారణ్యం - అరణ్యపర్వం" - డా॥. స్వర్ణలత గొట్టిముక్కల 5
12. మాడభూషివారి "శత్రువుతో ప్రయాణం"-సామాజిక అంశాలు - డా॥. కొమ్మనబోయిన సుజాత 6
13. ఆరు సారా కథలు - సామాజికత - డా॥. నల్లపనేని విజయలక్ష్మి 6
14. డా॥. వి. చంద్రశేఖర రావు కథల్లో సామాజికత - డా॥. కడియాల వెంకటరమణ 6
15. ఇతిహాసము లందలి ఆదర్శ స్త్రీ పురుషులు-సామాజికాంశాలు - డా॥. వేసిపోగుల వెంకటేశ్వర్లు 7
16. బసవేశ్వరుని వచనం - నవ్యసమాజ రచనం - డా॥. దండెబోయిన పార్వతీదేవి 7
17. కాళికాంబ సప్తశతి - సామాజికత - డా॥. మోకా ప్రతాప్ 8
18. భక్తి శతకాలు - సమాజ సందేశం - డా॥. పైడిపాటి ఉమానాథ శర్మ 8
19. కాలువ మల్లయ్య 'మా కథలు' - సామాజిక స్పృహ - డా॥. వి. వింధ్యవాసినీ దేవి 8
20. చివరి గుడిసె నవల - సామాజిక దళిత జీవన చిత్రణ - షేక్ షానాజ్ బేగం 9
21. 'వొంతు' కథల సంపుటి - మానవ సంబంధాల చిత్రణ - డా॥. పి. జయచంద్రుడు 9
22. బోయి భీమన్న 'పాలేరు' నాటకం - సామాజికత' - ఉషారాణి. పి 10
23. ఆంధ్ర మహాభారతంలో సామాజిక సంక్షేమ అంశాలు - వి.ఏ. సత్యనారాయణ 10
24. తెలుగు నవల - గిరిజన స్త్రీ సామాజిక జీవనం - డా॥. లింగాల మంగమ్మ 10
25. అభ్యుదయ కవిత్వోద్యమం దోరణులు - సామాజికత - ఆవుల బాలస్వామి 11

# మాడభూషివారి "శత్రువుతో ప్రయాణం" - సామాజిక అంశాలు

- డా॥. కొమ్మనబోయిన సుజాత, తెలుగు లెక్చరర్, టి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజి, కందుకూరు, ప్రకాశం జిల్లా.

"కవిత్వం జీవితానికి హాయినిస్తుంది. జీవితం కవిత్వానికి ప్రాణమిస్తుంది." "జీవితమంతా ఇజాలు - కవిత్వమంతా నిజాలు," "కవిత్వం జీవితాన్ని నిలదీస్తుంది. జీవితం కవిత్వాన్ని అభినందిస్తుంది." "జీవితం పిచ్చివాడి చేతిలో రాయి కావచ్చుకాని, కవిత్వం రాసేవాడి చేతిలోని పరసువేది" అంటూ ఆలోచనామృతమైన కవిత్వపు పరమార్థాన్ని గూర్చి అద్భుతంగా చెప్పిన డాక్టర్ మాడభూషి సంపత్‌కుమార్‌గారు జీవితాన్ని చదివి కవిత్వంలో ఎదిగిన కవి.

"శత్రువుతో ప్రయాణం" అనే వీరి కవితా సంపుటిలో మొత్తం 36 కవితలున్నాయి. ఈరోజు మనం కరోనా అనే శత్రువుతో ప్రయాణం చేస్తున్నాం. ఈ ఒక్క శత్రువేకాదు నిజానికి ఇవాళ్ళ మనిషి చుట్టూ కనిపించి కనిపించని శత్రువులెన్నో. కూర్చున్న కొమ్మను నరుక్కున్న చందాన తన చుట్టూ ఉన్న ప్రకృతిని, పర్యావరణాన్ని, మానవ విలువలను - అనుబంధాలను పతనం చేసుకుంటూ కుటుంబం పట్ల కాకుండా సమాజం పట్ల కూడా మనిషి చేసిన సమస్త ధ్వంసం గూర్చి వివరించారు మాడభూషివారు ఈ కవితలద్వారా. తోటి మనిషిపట్ల మిత్రుడిలా ఉండాల్సిన మనిషి చివరికి తనకు తెలియకుండానే తనకు తానే శత్రువైన క్రమాన్ని తెల్పుతూ మనిషే మనిషికి, ప్రకృతికి కూడ ప్రథమ శత్రువు అనే సత్యాన్ని తెలియచేస్తాయి ఈ కవితలు.

సంగీతంలో శ్రుతులు, అపశ్రుతులు ఉన్నట్లే తెలిసో తెలియకో మనిషి చేసే తప్పిదాల వల్ల మానవ జీవన సంగీతంలో కూడా సుస్వరాలతో పాటు అపస్వరాలు కూడా ఉంటుంటాయి. హృదయంలోని శోకమే సంగీతం అంటాడు తాత్వికవేత్త కన్‌ఫ్యూషియస్. పంచరంగులను అద్దుకొని కనువిందు చేసే సీతాకోకచిలుకకు ఎన్నో దశలు దాటితేగాని ఆ రూపురాదు. పాటయినా, కవిత్వమైనా అంతే. కవి హృదయంలో సమాజానికేదో చెప్పాలనే ఒక తీవ్రమైన తపన, ఆవేదన ఉంటేగాని మంచి కవిత్వం రాదు. మాడభూషి వారిలో ఉన్న ఆ తీవ్రమైన తపనే వారిచేత మంచి కవిత్వాన్ని రాయించింది.

జీవన సమరంలో కత్తి కిందపడకుండానే తుది వరకు పోరాడిన వీరుడిగా తన తండ్రిని గూర్చి చెప్పిన "కత్తి కిందపడకుండానే" కవిత కవియొక్క ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని పట్టి చూపే మచ్చుతునక. బిడ్డల కోసం నిరంతరం ఒక తండ్రి పడిన శ్రమను, తపనను గుండెల్లో పదిల పరుచుకొన్న ఒక బిడ్డ రచించిన అందమైన స్మృతి గీతం ఈ కవిత అనొచ్చు.

కవి దేశానికి ఆత్మ. దేశంలోని ప్రతి సమస్యపట్ల కవి స్పందించాలి. కాదేది కవితకనర్హం అన్నట్లు ప్రతి అంశం, ప్రతి విషయం కవితా వస్తువే. కవిభేరి అనే కవితలో ఈ విషయం గూర్చి ప్రస్తావిస్తూ

"నేనుగాని
రాయకుంటె
దేశభక్తి, దాస్యముక్తి, ప్రజాశక్తి
దేశమందు
నాశనౌతాయి."

అని ఒక చారిత్రక సత్యాన్ని చెప్తారు కవి.

మహా కవులు రాయకపోతే ఏమవుతుంది. ప్రజల హృదయాల్లో ఆర్ద్రతను నింపే, విలువలను పెంచే సాహిత్యమే లేకపోతే సమాజం పరిస్థితి ఏమిటో ఊహించుకోవడానికే భయం వేస్తుంది. కవులు తమ రచనలద్వారా సమాజంలో ఒక స్ఫూహని, ఒక గొప్ప చైతన్యాన్ని తీసుకురావడమే కాక సంఘటిత పరిచే శక్తిగా కూడా పనిచేస్తారు. ఇంతకు మించిన ప్రయోజనం ఏం

ఉంటుంది. ఏ సాహిత్యానికైనా ఈ అంశాల్ని చాలా చక్కగా ఈ కవిత ద్వారా వ్యక్తపరిచారు.

ఒక్క దేశిజం తప్ప కులం, మతం, ప్రాంతం, భాష ఇలా ఎన్ని యిజాలో నా దేశంలో అని చెప్పే 'నిజం' కవిత సమాజానికో చక్కని సందేశాన్నిస్తుంది. నన్నయ నుండి నేటి ఆధునిక కవి వరకు తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహా కవులందరిని పదార్చనతో సేవించి 'తెలుగు వెలుగులు'గా ఆవిష్కరించారు. ఇందులోని ఒక మచ్చు తునక

ఆట వెలదిని ఈటెగా
చేపట్టినాడు
కుళ్ళిన సంఘాన్ని కూలదోసి
విశ్వదాభిరాముడై వెలిగినాడు.

ఎంత ఎదిగినా, ఎంత అభివృద్ధి సాధించినా స్త్రీల విషయానికొచ్చే సరికి సమాజం ఇంకా సంకుచిత ధోరణిని విడిచిపెట్టడం లేదనే సత్యాన్ని చాలా చక్కగా వివరించారు 'ఆమె' అనే కవితలో. తల్లిదండ్రులు సైతం చిన్నచూపు చూసే వైనాన్ని చెప్తూ

"చేసిన పనికి కృతజ్ఞత లేదు
చెయ్యాల్సిన పనికి మాత్రం దబాయింపులు
మొగుడింటికి
పోతే చెప్పుదెబ్బలు తింటావని శాపనార్థాలు
ముందుగానే మొగుడికి అనుమతి లభించింది
ఇక పెళ్ళాంగా ఆమె గతి అధోగతి!

అని అంటారు. గుండెలమీద తన్నినా గుండెకు హత్తుకుంటుంది అంటూ స్త్రీలలో ఉండే క్షమాగుణాన్ని గూర్చి చెప్తూ

"ఆమెను
మానవత్వంతో చూడ్డంలేదు
కనీసం
మనిషిగా గుర్తించలేదు, అయినా
ఆమె లేకుండా
మానవ చక్రం పరిభ్రమించదు
అందుకే
ఆమెను
పరిమళించనివ్వండి
లోకాన్ని సుభరితం చెయ్యండి

అంటారు కవి. ఒక వ్యక్తి వక్తిత్వాన్ని అంచనా వేయాలంటే స్త్రీలపట్ల అతని దృక్పథం ఏమిటో తెలిస్తే అతనేంటో అంచనా వేయవచ్చు. ఈ దృష్టితో చూసినపుడు మాడభూషి వారి ఉన్నతమైన వ్యక్తిత్వం అవగతమవుతుంది.

"మగాడంటే
మొనగాడని చెప్పింది అవ్వ
అవుననుకున్నది అమ్మ."

పాతతరం ఆడవాళ్ళు అమాయకత్వంతో ఇదే నిజమని నమ్మినా ఈ తరం వనితలెవ్వరూ అమాయకంగా లేరని మగాడంటే మొనగాడు కాదు మోసగాడు అని గ్రహించారనే విషయాన్ని 'మగాడు' అనే కవిత తెలియచేస్తుంది. ఎంతో చాకచక్యంగా లౌక్యంగా స్త్రీని దోపిడి చేసిన వంచించిన అణిచివేసిన వైనాన్ని చెప్తూ

"మగాడంటే
కూడా ఉండి గొంతు కోసేవాడంది!
భారాన్నంతా నాపైన పడేసి
నన్నే మోయమనేవాడు
తాను మోస్తున్నట్టు మోసం చేసేవాడు
సుఖాన్ని తాను అనుభవిస్తూ
నన్ను సుఖపెడుతున్నట్టు భ్రమపెట్టేవాడు
నన్ను నీడ పట్టులో ఉండమన్నట్టు చెబుతూ
ఇంటో బానిసను చేశాడు!
నేను సహవాసం చేస్తున్నది
శత్రువుతో
నేను సహజీవనం చేస్తున్నది
శత్రువుతో
నేను

పని పంచుకొంటున్నది
శత్రువుతో..."

అని ఏవిధంగా స్త్రీలు మోసపోతూ వచ్చారో, తమ స్థితిని ఏమిటో కూడా తెలుసుకోలేక భ్రమల్లో జీవిస్తున్నారో తెలిపారు. "మగవాళ్ళం మేం మాట్లాడుతున్నాం కదా!", "మధ్యలో నువ్వెందుకు మాట్లాడతావు", "నీకేం తెలియదు" "నీకేం తెలుసని మాట్లాడుతున్నావు" "నోరు మూసుకో" వంటి మాటలు ఇప్పటికీ మన సమాజంలో వినబడుతున్న మాటలే. ఆ విషయాన్ని ప్రస్తావిస్తూ

చెవులు కుట్టారు
ముక్కు కుట్టారు
బాధగా ఉన్నా
భరించాను నోరు మూసుకొని
అంతా నా అందం కోసమేనని
తీరా నోరు తెరవాలని
ప్రయత్నించినప్పుడు గానీ
తెలియలేదు
ముందుగానే
నోరుకూడా కుట్టేశారని!

అంటారు.

"రూపాంతరం" అనే కవితలో మనిషినుంచి మనిషిని వేరుచేసిన ఒకానొక దౌర్భాగ్యకరమైన పరిస్థితిని గూర్చి వర్ణిస్తూ

"రాయిగా మారుతా
పూజలందుకొంటా!
చెట్టుగా మొలుస్తా
నీళ్ళు పోయించుకొంటా!
మనిషిగా ఉంటేనే కదా
నువ్వు అంటకుండా ఉండేది
రాతిలో మొక్క మొలకెత్తినట్టు
మనిషిలో మనసు మొలకెత్తినప్పుడు
నేనూ మనిషిగా నిలబడతా!
మనిషి మారకపోతే
మనిషి పైనే తిరగబడతా!

అంటూ అలాంటి పరిస్థితులు ఎప్పటికైనా రూపాంతరం చెందక తప్పదనే సత్యాన్ని ఈ కవిత ద్వారా తెలియజేశారు.

"యుద్ధాన్ని గురించి భయంలేదు
మరణాన్ని గురించి భయంలేదు
క్రూర మృగాల గురించి
విష నాగుల గురించి
సునామీ గురించి
ఉప్పొంగే నదుల గురించి భయంలేదు
నా భయమంతా మనుషుల గురించే
మనిషి రూపంలో ఉన్న మనిషి గురించే"

అని అంటారు 'మనిషి' అనే కవితలలో. మనిషిలో ఉన్న స్వార్థం మమతలనే కాదు ప్రకృతిని సైతం ఏవిధంగా ధ్వంసం చేస్తుందో మనిషే మనిషికి శత్రువుగా ఎలా మారాడో చెప్పారీ కవిత ద్వారా. సాటి మనిషి పట్ల, సమాజం పట్ల, సమాజంయొక్క మంచి చెడుల పట్ల ఒక కవియొక్క హృదయ స్పందనలే కవితలు. అట్టి హృదయ స్పందనలైన డా॥ మాడభూషి సంపత్ కుమార్‌గారి ఈ కవితలు సహృదయ హృదయాలను ఆకట్టుకునే చక్కని సందేశాత్మకాలు.